క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధర పురం ఆర్టీసీ డిపో పరిధిలో సిటీ బస్‌ల నిర్వహణపై ప్రయాణికుల సూచనలు, సలహాలు, వారి సమస్యలపై శనివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు 99592 25458 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు, సూచనలు, ఫిర్యాదులను తెలియజేయాలని వివరించారు.

పొట్టిశ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో దీపావళి వేడుకలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శుక్రవారం దీపావళి వేడుకలు నిర్వహించారు. ఆ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యాన జరిగిన వేడుకల్లో విభాగాధిపతి డాక్టర్ వి.విజయదుర్గాప్రసాద్ మాట్లాడుతూ దీపావళి అనేది ఐదు రోజుల పండుగన్నారు. ధనత్రయోదశితో ప్రారంభమై భగ్నిహస్త భోజనం విదియతో ముగుస్తుందన్నారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో పాటు అధ్యాపకులు పూజలు చేసి టపాసులు వెలిగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై కర్రతో దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యువకుడిపై కర్రతో దాడికి పాల్పడిన నలుగురిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నెం 48కి చెందిన కట్టా జయరాజు రైల్వేస్టేషన్‌లో పని చేస్తుంటాడు. గురువారం రాత్రి కాలనీవాసులు సాయి, సురేష్‌కు గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో సాయితో జయరాజు, అన్నయ్య గోపి మాట్లాడి ఇంటికి పంపేశారు. రాత్రి 12 గంటల సమయంలో పాలవర్తి చిరంజీవి, సాయి, నాగరాజు, నాగేంద్రల.. గోపి ఇంటికి వచ్చి గొడవ చేశారు. దీంతో గోపి.. తమ్ముడు జయరాజుకు ఫోన్ చేయగా అతను వచ్చాడు. జయరాజును నాగరాజు కర్ర తీసుకుని కొట్టడంతో గాయపడ్డాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దాడి ఘటనపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చెక్క బల్లతో దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్‌లోని చిట్టి గారి పార్కు సమీపంలోని ఓ భవనంలో నల్లూరి అశోక్‌కుమార్ కుటుంబం అద్దెకు ఉంటుంది. వీరి ఇంటి పక్క పోర్షన్‌లో మల్లి కుటుంబం నివసిస్తోంది.. గురువారం రాత్రి 12 గంటల సమయంలో మద్యం తాగి వచ్చిన మల్లి గేట్ తాళాల కోసం అశోక్‌కుమార్ కుటుంబంతో గొడవ పడి దూషించాడు. శుక్రవారం ఉదయం కూడా గొడవకు దిగడమే కాకుండా చెక్క బల్లతో దాడికి దిగడంతో అశోక్‌కుమార్‌కు గాయమైంది. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కనకదుర్గ ప్రభ భక్తులందరికీ చేరాలి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కనకదుర్గ ప్రభ మాస పత్రిక అమ్మవారి భక్తులందరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని దుర్గగుడి ఈవో కె.ఎస్. రామారావు సిబ్బందిని ఆదేశించారు. ఆయన శుక్రవారం పలు విభాగాలను తనిఖీ చేశారు. మహా మండపం నాలుగో అంతస్తులోని కనకదుర్గ ప్రభ మాస పత్రిక కార్యాలయాన్ని పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. దేవస్థాన మాస పత్రిక కనకదుర్గ ప్రభ భక్తులకు మరింత చేరువ కావడానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలనే దానిపై చర్చించారు. ప్రతి నెలా ఎంత మంది భక్తులకు కనకదుర్గ ప్రభ పుస్తకం చేరుతుందని ఆరా తీయడంతో పాటు చందాదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న ఈవో మార్గమధ్యలో శానిటేషన్ గురించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

దుష్టశక్తులను రాష్ట్రం నుంచి తరిమివేయాలి

ఎస్సీ కమిషన్ సభ్యుడు బసవరాజు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తుంటే ప్రతిపక్ష నేతలు ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారని ఎస్సీ కమిషన్ సభ్యుడు కె బసవరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ వంటి దుష్టశక్తులను రాష్ట్రం నుంచి తరిమేయాలన్నారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను రాజ్యాంగ పదవిలో ఉన్నందున రాజకీయ విమర్శలు చేయడం లేదని. తనకు పదవి ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తుంటే తట్టుకోలేకపోతున్నానన్నారు. ఆయన్ను ఓడించడానికి పనిచేస్తున్న చంద్రబాబు, పవన్ కల్యాణ్, కొన్ని మీడియా సంస్థలు, దళిత ద్రోహులు జడ శ్రవణ్, మహాసేన రాజేష్‌పైనా పోరాడతానన్నారు.

జగనన్నతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు
- 53వ డివిజన్‌లో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే...' సభలు
- స్థానికంగా జరిగిన అభివృద్ధిని తెలియజేసిన ప్రజాప్రతినిధులు



53వ డివిజన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. 53వ డివిజన్‌లోని 188వ సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమాన్ని స్థానిక రాయల్ హోటల్ సెంటర్‌లో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గత ప్రభుత్వాలేవి చేయని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నేడు అమలు చేసిందన్నారు. ఎన్నికల వాగ్దానాలను నూటికి నూరు శాతం అమలు చేసిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందని చెప్పారు. ప్రధానంగా మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రజలు గుర్తుంచుకునే రీతిలో పాలన చేశారన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ కార్యక్రమాలు అనేక మంది జీవితాల్లో వెలుగులు నింపాయని తెలిపారు. అంతకుమించి నేడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని వివరించారు. జరిగిన అభివృద్ధిని కళ్లు ఉండి కూడా చూడలేని దుస్థితిలో టీడీపీ, జనసేన పార్టీలు ఉన్నాయని దుయ్యబట్టారు. విద్యా, వైద్య, ఆర్థిక, పాలన రంగాల్లో ఇతర రాష్ట్రాలకు ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా ఉందని, ఈ విషయాన్ని కేంద్ర నివేదికలే చెబుతున్నాయని వివరించారు. ప్రధానంగా చంద్రబాబునాయుడు చేసిన కార్యక్రమాలు ఒక్కటైనా ప్రజలను ప్రభావితం చేసిందో లేదో చెప్పాలన్నారు. 53వ డివిజన్‌లో డ్రైన్లు, రహదారుల నిర్మాణానికి సంబంధించి అనేక చర్యలు తీసుకున్నామన్నారు. గణపతిరావు రోడ్డు, డ్రైన్ వీధితో పాటుగా డివిజన్‌లోని అన్ని రహదారుల నిర్మాణం చేశామని తెలిపారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై ఏ చర్చకైనా సిద్ధమన్నారు. తొలుత సచివాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సచివాలయం పరిధిలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందన్నారు. స్థానిక కార్పొరేటర్ మహాదేవు అప్పాజీరావు మాట్లాడుతూ 188వ సచివాలయం పరిధిలోనే సుమారు రూ. 7 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. తొలుత ప్రభుత్వం నగరాల సామాజిక వర్గాన్ని అన్ని జిల్లాల్లో బీసీలుగా గుర్తిస్తూ శుక్రవారం జీవో విడుదల చేసిన సందర్భంగా ఆ సామాజిక వర్గ నేతలు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ శీరం వెంకటరావు, న్యాయవాది పిళ్లా రవి, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్, దుర్గాకోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ కొరగంజి భాను తదితరులు సత్కరించారు. కార్యక్రమంలో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్పొరేటర్ అర్షద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

కేదారేశ్వరపేటలో

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వ హయాంలో పశ్చిమ నియోజకవర్గంలో జరగని అభివృద్ధి పనులను చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' కార్యక్రమం శుక్రవారం కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లోని వీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించారు. వెలంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి, వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తూ నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై ఎప్పుడైనా చర్చలకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు. తమ ప్రభుత్వం ప్రజల పక్షాన పనిచేస్తుందని, గత ప్రభుత్వంలా వడ్డీ వ్యాపారులకు, కాల్‌మనీ దందాలు చేసే వారి పక్షాన పని చేయదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నా టీడీపీ, జనసేన నాయకులకు కంటికి కనిపించకపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీల, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శరత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



వైద్య శిబిరంలో మందులను పరిశీలిస్తున్న ఈవో రామారావు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): నేషనల్ ఆయుర్వేద డే పురస్కరించుకుని శుక్రవారం ఇంద్రకీలాద్రిపై ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విశ్వ ఆయుర్వేద పరిషత్, సురక్ష ఆయుర్వేద చికిత్సాలయం సంయుక్త ఆధ్వర్యాన మహా మండపం ఆరో అంతస్తులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో తొలుత ధన్వంతరి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు ప్రారంభించారు. ఆయుర్వేదిక్ వైద్యులు పూర్ణ, రాజేశ్వరి తన సిబ్బందితో కలిసి వైద్య సేవలను అందించారు. ఆలయ కమిటీ చైర్మన్, ఈవోలతో పాటు ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆలయంలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బందితో పాటు పలువురు భక్తులు వైద్య సేవలు పొందారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈవో వెంకటరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఆయుర్వేద వైద్యులు డాక్టర్ సాహితి, డాక్టర్ ధరణికుమార్, డాక్టర్ సత్యప్రశాంత్ వైద్య సేవలను అందించారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన



ఇంద్రకీలాద్రిపై నృత్య ప్రదర్శన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): చక్కని తల్లికి చాంగు భళా.. కొండల్లో నెలకొన్ని కోనేటి రాయుడు..... ఇదిగో.. భద్రగిరి అంటూ చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ధర్మపథంలో భాగంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీనాట్య తరంగిణి డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన చేశారు. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై రిత్విక, చందన, మనిృత, అన్సిక, శరణ్య, వర్షిత, హర్షితతో పాటు మరి కొంతమంది చిన్నారులు నృత్య ప్రదర్శనలో పాల్గొన్నారు. నృత్య ప్రదర్శన అనంతరం అమ్మవారిని దర్శించుకున్న చిన్నారులకు ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

45వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కొబ్బరికాయ కొట్టిన మాధురి లావణ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి తెలిపారు. స్థానిక వంగవీటి మోహనరంగా జంక్షన్ సమీపంలోని ఎస్ఎస్ వైభవ్ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న రహదారిలో రూ.5లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మించడానికి శుక్రవారం 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య కొబ్బరికాయ కొట్టి శ్రీకారం చుట్టారు. ఆమె మాట్లాడుతూ ఈ రహదారిలో స్థానికుల రాకపోకలకు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. వెలంపల్లి ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు రోడ్డు నిర్మాణానికి అంచనా వేసి మంజూరు చేసిన నిధులతో ఈ రోజు నిర్మాణ పనులను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దుర్వేసుల హుస్సేన్, ముత్తా వాసు, బైపినేని కోటేశ్వరరావు, బోర మల్లేశ్వరరెడ్డి ,ముత్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ వైద్య విధానం ఆయుర్వేదం



మాట్లాడుతున్న డాక్టర్ కేఎస్ఎస్ శివకృష్ణ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆయుర్వేదం ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్య విధానమని ఆయుర్వేద డాక్టర్ కేఎస్ఎస్ శివకృష్ణ అన్నారు. కేబీఎన్ కళాశాల జాతీయ సేవా పథకం విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఆయుర్వేద దినోత్సవం పురస్కరించుకొని అవగాహన సదస్సు, వైద్య శిబిరాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ విష్ణుమూర్తి స్వరూపమైన ధన్వంతరి జయంతి రోజున జాతీయ ఆయుర్వేద దినోత్సవం జరుపుకుంటామన్నారు. ఆయుర్వేదాన్ని ప్రపంచంలో అన్ని సంస్థలు అంగీకరించిన వైద్య విధానమన్నారు. ఆయుర్వేద చికిత్స, మందులతో ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవన్నారు. శాశ్వత పరిష్కారాన్ని ఆయుర్వేదం చూపుతుందన్నారు. ఉత్తమ జీవన విధానాన్ని బోధిస్తుందన్నారు. ఆయుర్వేద మందులు చాలా వరకూ మన చుట్టుపక్కల కనిపించే వృక్షాల నుంచి సేకరించినవేనన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం విశిష్టతను ప్రపంచం గుర్తించిందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ డి. శ్రీతేజ, డాక్టర్ ఎం.హరిచందన వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, పీజీ డైరెక్టర్ ఎస్ వెంకటేష్, ఎన్ఎస్ఎస్ పీవోలు వీఎస్‌రావు, పవన్‌కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

26న రజక ఆత్మగౌరవ సభ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ రజక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నాగార్జున విశ్వవిద్యాలయం సమీపంలోని మైదానంలో రజక ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నట్లు జేఏసీ కన్వీనర్ అంజిబాబు తెలిపారు. శుక్రవారం విజయవాడ ఐలాపురం హోటల్‌లో జేఏసీ సమావేశం జరిగింది. దీనిలో రజక ఆత్మగౌరవ సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అంజిబాబు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని రజక సోదరులు ఆత్మగౌరవ సభకు తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చాకలి ఐలమ్మ కమిటీ అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఇన్ఫర్మేషన్ పార్కు పనుల పరిశీలన



డిజైన్లు పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పటమట(విజయవాడతూర్పు): అజిత్‌సింగ్‌నగర్‌లోని పూర్వపు డంపింగ్‌యార్డు స్థలంలో జరుగుతున్న ఇన్ఫర్మేషన్ పార్కు పనులను శుక్రవారం వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పరిశీలించారు. అక్కడ ఆధునికీకరణ పనులు పరిశీలించి మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పార్కులో ఆడిటోరియం పరిశీలించి మరింత మెరుగ్గా ఉంచడానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానికంగా ఏర్పాటు చేస్తున్న గ్రీనరీని పరిశీలించి హెర్బల్, జోడైక్ గార్డెన్ సంబంధించిన మొక్కలు నాటాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్‌పై అధికారులు డిజైన్లను ప్రదర్శించగా వాటిని మరింత మెరుగ్గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.వి. సత్యవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్, ఉద్యానవన విభాగం అధికారి శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్యాలు పెంచుకోవాలి



సబ్‌కలెక్టర్ అదితిసింగ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యార్థులు సిలబస్‌తో పాటు, వివిధ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని విజయవాడ సబ్‌కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. నలంద డిగ్రీ కళాశాల మేనేజ్‌మెంట్ మీట్ బ్రెయిన్ స్టోమర్స్ 2కె233 శుక్రవారం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. కళాశాల మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ చదువు మార్కుల కోసమే కాకుండా, విజ్ఞానాన్ని పెంపొందించుకుంటూ, ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు నేర్చుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న నలంద యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో క్లౌడ్ అండ్ సెక్యూరిటీ ఆర్కిటెక్ట్ జి.గోపినాథ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అనురాధ, మేనేజ్‌మెంట్ హెచ్‌ఓడీ వై.శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్విజ్, పోస్టర్ మేకింగ్, బిజినెస్ ప్లాన్, మైమ్‌షో, ఇన్‌స్టా రీల్, ప్రొడక్ట్ లాంచింగ్, యంగ్ మేనేజర్, పర్సనాలిటీ కాంటెస్ట్, స్పాట్ ఫొటోగ్రఫీ , గ్రూప్ డ్యాన్స్ వంటి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

నేడు దుర్గమ్మ సన్నిధిలో లక్ష్మీయాగం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధన త్రయోదశిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శనివారం శ్రీమహాలక్ష్మి యాగాన్ని నిర్వహించనున్నారు. యాగశాలలో ఉదయం 8 గంటలకు ఆలయ వైదిక కమిటీ యాగాన్ని నిర్వహిస్తుంది. యాగంలో పాల్గొనాలనుకునే భక్తులు రూ. వెయ్యి టికెట్ కొనుగోలు చేయాల్సి ఉంది. యాగంలో పాల్గొన్న భక్తులకు ప్రత్యేక క్యూలైన్ మార్గంలో అమ్మవారి దర్శనానికి అనుమతిస్తారు.

ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ ఆదిలక్ష్మి తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందజేస్తామని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామన్నారు. 48వ డివిజన్ పరిధిలో చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష మెడికల్ క్యాంప్‌ను మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరంలో ఏర్పాటు చేసిన వైద్య సేవలపై ఆరా తీయడమే కాకుండా వైద్య శిబిరానికి విచ్చేసిన ప్రజలతో మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే భావనతో అధికారులు, వైద్యులు సమన్వయంతో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నారన్నారు. కేవలం వైద్య పరీక్షలు చేయడమే కాకుండా అవసరమైన వారికి మందులను అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, డివిజన్ పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, నగరపాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష అని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తెలిపారు. 38వ డివిజన్ విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని 119 సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను శుక్రవారం ఆయన, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, స్థానిక కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసాతో కలిసి సందర్శించారు. వైద్య శిబిరంలో జరుగుతున్న వైద్య సేవలను పర్యవేక్షిస్తూ అక్కడికి వచ్చినవారిని ఎందుకు వచ్చారో ఆరా తీశారు. అనంతరం వెలంపల్లి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు ఏ విధంగా మేలు చేయగలమా అన్న ఆలోచన చేశారని తెలిపారు. ప్రధానంగా విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యమిచ్చి నాడు–నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, ఆసుపత్రుల అభివృద్ధి చేశారని చెప్పారు. కార్యక్రమంలో 38వ డివిజన్ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, పార్టీ నాయకులు బొమ్ము మధు, మంటి కోటేశ్వరరావు, బి.శాంతి, అండిమాని బాబ్జి, సూర్య, రేలంగి బుజ్జి పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా పాతబస్తీలో 37వ డివిజన్ పరిధిలోని దళవాయి సుబ్బరామయ్య వీఎంసీ పాఠశాల ఆవరణలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. దీన్ని ఎమ్మెల్యే శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీతో కలిసి ప్రారంభించారు. వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ సచివాలయం పరిధిలో ఉన్న అందరికీ వైద్యం అందిస్తున్నామన్నారు.

బీజేపీకి మద్యంపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదు

బీజేపీ నేతలకు మద్యంపై ఉన్న ప్రేమ ప్రజలపై లేదని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివద్ధికి బీజేపీ ఏమి సహకరిస్తోందో పురందేశ్వరి సమాధానం చెప్పాలన్నారు. చంద్రబాబు రాసి ఇచ్చిన స్క్రిప్ట్ పురందేశ్వరి చదువుతున్నారన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

స్మృతివనం పనుల పరిశీలన

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో ఏర్పాటు చేస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు 95 శాతం పూర్తయ్యాయని, ఈ నెల 26న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ తెలిపారు. శుక్రవారం స్మృతివనం నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రస్తుతం సీలింగ్, ప్లాస్టింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. సందర్శకుల సౌకర్యార్థం భారీస్థాయిలో పార్కింగ్ ఏరియా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంగణం ఆకర్షణీయమైన వివిధ రకరకాల పూలతో కనువిందు చేస్తుందని పేర్కొన్నారు.



దీపావళికి తంబీల విక్రయాలు

దీపావళికి భిన్న రకాల దీప సామగ్రి శుక్రవారం మార్కెట్‌లోకి వచ్చాయి. నగర పరిసరాలతోపాటు తమిళనాడు తిరుచ్చి, సేలం పట్టణానికి చెందిన 20 మంది బృందం నగరానికి తరలివచ్చి ప్రమిదలను విక్రయిస్తున్నారు. డజను ప్రమిదలను 30 నుంచి రూ.40కి విక్రయిస్తుండగా బొమ్మలను రూ.20 నుంచి రెండు వందల వరకూ విక్రయిస్తున్నారు. –వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

అలరిస్తున్న సంగీత మహోత్సవాలు



విజయవాడ కల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో 30 వార్షికోత్సవం సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల సంగీత కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న సంగీత మహోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. హైదరాబాద్ సోదరులుగా ప్రసిద్ధిచెందిన డి.రాఘవాచారి, డి.శేషాచారి శుక్రవారం నిర్వహించిన కచేరి ఆద్యంతం సంగీత ప్రియులను అలరించింది. నీ వెవరివో, ఎవరని నిర్ణయించేదిరా, హరియువతీ హైమవతి తదితర కీర్తనలను ఆలపించారు. వయోలిన్‌పై బీవీ దుర్గాభవాని, మృదంగంపై కోటిపల్లి రమేష్, ఘటంపై ఎం. హరిబాబు సహకరించారు. నగరానికి చెందిన సంగీత విద్వాంసులు అన్నవరపు రామస్వామి, దండమూడి సుమతీ రామ్మోహనరావు, మోదుమూడి సుధాకర్,అంజనా సుధాకర్ పాల్గొన్నారు. సద్గురు సంగీత సభ అధ్యక్షుడు బీవీఎస్ ప్రకాష్ మాట్లాడుతూ శనివారంతో ఉత్సవాలు ముగుస్తాయని మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోనరావుకు సంగీత సద్గురు విద్వన్మణి బిరుదుతో సత్కరిస్తున్నామన్నారు. కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం అధ్యాపకుడు డాక్టర్ చింతారవి బాలకృష్ణ బృందం భక్తప్రహ్లాద నృత్యరూపకం ప్రదర్శిస్తారని తెలిపారు.